# మనసు తెచ్చిన మార్పు

శాంత, నేను చిన్నప్పుడు ప్రాణస్నేహంగా వుండేవాళ్ళం. ఏ పనిచేసినా ఇద్దరూ కలసి చేయవలసిందేకాని, అందులో ఏమాత్రం హెచ్చుతగ్గులు వచ్చినా తగువులాడుకు ఏడ్చేవాళ్ళము. కాని మాలొ ఒక్క సుగుణము ఏమిటంటే ఆ ఏడుపులోనే మమ్మల్ని మేమే గారంచేసుకుని బ్రతిమాలుకునేవాళ్ళం, ఇంకొకళ్ళకి శ్రమలేకుండా; శాంత ఒట్టి మాటల పోగు. ఎవరైనా ఏదేనా అంటే కొంచమైనా తడుముకోకుండా సమాధానం చెప్పేది. నాకు అల్లా చేతనయ్యేదికాదు; తరువాత అనుకునేదాన్ని - ఇల్లా చెప్పివుంటే బాగుండేది - అని. ఏమిలాభం? అప్పుడు చెప్పలేకపోయాక. బడిలోకూడా దానికేపేరు. అందర్నీ నవ్విస్తూ, కొంటెపనులు చేసినా అంతా దాన్నే మెచ్చుకునేవారు. క్లాసులో ఏదైనా ప్రశ్నవేస్తే, అది చదవకుండానే వాళ్ళు వాళ్ళు చెప్పేవాటిల్లోవి తను చమత్కారంగా చెప్పేసి తను సరైన సమాధానము చెప్పిందని పేరు తెచ్చుకునేది. నేను ఎంత కష్టపడి చదివినా ప్రశ్న అడిగిన దానికి చెప్పలేక ఒకటికొకటి చెప్పి చీవాట్లు తినేదానిని.

పర్యవసానం కొంచెము పెద్ద అయ్యేకొద్దీ ఈర్ష్యో, మరోటో కాని అప్పుడప్పుడు నాకు దానిమీద కోపం వస్తూండటం, మళ్ళా ఎల్లాగో నాలో నేను సమాధానపడి పైకి ఏమీ కనబడకుండా మామూలుగా దానితో మాట్లాడేదాన్ని. చిన్నప్పుడు దానికంటే నేనే అందమైనదాన్ని అని చెప్పుకునేవారు. కొంచెము పెద్దయ్యాక "దీనికంటే అదే అందంగా వుంటోంది!" అని ఎవరైనా అంటే నాకు ఒళ్ళు మండిపొయ్యేది చెప్పొద్దూ. ఎందుకు? అద్దంలో చూసుకున్నప్పుడు ఆ మచ్చని తల్చుకుని బాధపడేదాన్ని.

ఒకసారి మా మేనమామ పట్నంనుంచి వస్తూ తన స్నేహితుణ్ని వెంటబెట్టుకు వచ్చాడు. మామయ్య నాకు చాలా వస్తువులే తీసుకువచ్చాడు, రకరకాల పువ్వుల పరికిణీ గుడ్డలు, ఓణీలు, గాజులు, బొమ్మలువగైరా చాలాతెచ్చాడు. అవన్నీ చూచేసరికి నాకు పట్టలేని సంతోషం వచ్చింది. ఎందుకంటే ఇవన్నీ చూపించి దానికి లేవని ఉడికించి నేను ఆనందించాలి - అదే నా సర్దా. వాళ్ళింటికి వెళ్దామని నేను బయల్దేరాను. ఇంతలో అమ్మ లోపల్నుంచి "వంటిల్లు తుడిచి పీటలు వెయ్యి" అన్న కేకతోటి ఆగిపోయాను. తరువాత సావకాశంగా వెళ్ళవచ్చునని, మామయ్యా, ఆ వచ్చిన ఆయన భోజనాలదగ్గర కబుర్లు మొదలుపెట్టారు. మాటలమధ్యలో ఆ వచ్చినాయనకి పెళ్ళికాలేదని, పెద్దచదువు చదువుతున్నాడని తేలింది. మా బామ్మ వెంటనే అందుకొని "ఏమి నాయనా! మా పిల్లని చేసుకోకూడదూ? అన్నట్టు మిగోత్రం ఏమిటి" అని అడిగింది. ఆయన కొంచెము బిక్కమొహంపెట్టి 'అవన్నీ నాకు తెలియవండి. అయినా ఇప్పుడు నా పెళ్ళికి తొందరేమిటి లెండి' అన్నారు.

ఆరోజే ఆయన వాళ్ళవూరు వెళ్ళిపోయారు. బామ్మ మళ్ళీనాన్నతో "పిల్లాడు బాగానే వున్నాడు. మన పిల్లని చేసుకుంటాడేమో కనుక్కోరా" అంది. "నువ్వు వూరుకోవే, అన్నింటికి ఒకటే తొందర ఆస్తిపాస్తులు ఏమి వున్నాయో, వంశము ఎట్లాంటిదో కనుక్కోకుండా పిల్లాడి రంగుచూసి పిల్లనిస్తామా ఏమిటి, అయినా మన 'రమణ' వున్నాడుగా వాడిని అడిగితే అన్నీ తెలుస్తాయి.""అవునులే నాయనా నాకు ఏమి తెలిసిచస్తుంది! ఎప్పుడేనా పెళ్ళిళ్ళు చేశానా ఏమన్నానా. మీరు మీరు సంప్రదించుకొని చేసుకోండి. బుద్ధి తక్కువదాన్ని ఎన్నిసార్లు కలుగచేసుకోకూడదనుకున్నా మళ్ళా నేను వున్నా అంటో తయారు అవుతా" అని ముక్కు తుడుచుకుంటూ బామ్మ తులసికోట దగ్గరికి వెళ్ళిపోయింది.

"ఇప్పుడు నేనుమాత్రం ఏమన్నానే అల్లా రుసరుసలాడుతావు - ఎప్పుడూ ఇంతే నీతో' ' అని నాన్న అరుగుమీదకి వెళ్ళిపోయాడు.

మామయ్యని కనుక్కుంటే వాళ్ళకి శెంటుభూమికూడా లేదని తేలింది. చదువుకూడా అబ్బాయి తెలివితేటలుచూసి ఎవరో ఓ పెద్దమనిషి చెప్పిస్తున్నారని చెప్పాడు. తరువాత కొంతకాలము నా పెళ్ళిప్రస్తావన రాలేదు.

ఆ సంవత్సరంతో మా స్కూల్లో చదువు పూర్తి అవుతుంది పైక్లాసువాళ్ళకి. అందుకని నాటకాలు, హాస్యవేషాలు, వగైరా పెట్టి హుషారు చెయ్యాలి అని సంకల్పించారు మా టీచర్లు. ఆ సందర్భంలో స్కూళ్ళ ఇనస్పెక్టరు సుబ్బారాయుడిగారిని ఆహ్వానించారు. ఆరోజునే అన్ని నాటకాలు, సంగీతపోటీలు, హాస్యవేషాలు - అన్ని అనుకున్నదాని కంటే చాలా బాగా జరిగాయి - అనుకున్నారు. నాటకంలో శాంతభర్తగా వేశాను. ఏం లాభం? అప్పటిదాకా ఒక తప్పు లేకుండా అప్పచెప్పిన నేను ఆ మనుష్యుల్ని చూసి నోరు విప్పలేక పోయాను. శాంతమటుకు ఆ జనాన్నిచూసి నేను మాట్లాడలేదన్న లోటు లేకుండా నాది, తనది కలిపి మాట్లాడేసింది. అందరూ నవ్వారు. మొదటి బహుమతి దానికే వచ్చింది నాకు ఎంతో కష్టంకలిగింది. అసలు నాటకంలోనే వెయ్యకుండావుంటే బాగుండునని అప్పుడు అనిపించింది.

సుబ్బారాయుడుగారు మాట్లాడుతూ శాంతలా ఇంత హుషారుగా నటించిన పిల్లని ఇన్ని స్కూల్సుకు వెడుతూంటా కాని, ఇంతవరకూ చూడలేదని, ఇంకా ఏమిటేమిటో పొగిడేశారు. శాంతకి ఇంకా చదువుచెప్పిస్తే బాగా రాణిస్తుందనీ, ఈ ధోరణిలో చాలాసేపు మాట్లాడాడు. వచ్చినవాళ్ళంతా ఎంతో శ్రద్ధగావిన్నారుకాని, నాకుమాత్రం అది వింటూంటే తలనొప్పి, వికారంవచ్చింది.

తరువాత వరసగా శాంతకి, పద్మకి, జానకికి బహుమతులు ఇచ్చారు. నాక్కూడా

మాట్లాడకపోయినా వేషం బాగుందని అంతా కలసి ఒక బుద్దుడుబొమ్మ బహుమానంగా ఇచ్చారు. అంతా వెళ్లిపోయారు. నేనూ, శాంతా కొంత దూరం కలిసివెళ్ళాము. శాంత వూరుకోక 'నీకు ఇచ్చినబొమ్మ నీ వేషంలోలాగే చూసేందుకు బాగుంది' అని నవ్వింది. ఆ మాట నాకు ముల్లుగుచ్చుకున్నట్లు అనిపించింది. సమాధానం చెప్పేదానికి తోచలేదు. దుఃఖాన్ని లోపలే మింగుకుని గబగబా ఇంటికి వెళ్లిపోయా.

కొన్నాళ్ళకి పరీక్షలు అయి వేసంగి శెలవులు ఇచ్చారు. శెలవల్లో శాంతి పినతండ్రి పురుషోత్తంగారు వచ్చారు. ఆయన ఎక్కడో హైస్కూలు హెడ్మాష్టరుట. ఆయన రాగానే శాంతి అన్న బాబిగాడు, రెండో అతను రమణి కలిసి శాంతకి స్కూల్లోవచ్చిన బహుమతులు గురించి అక్కడ ఎవరెవరెల్లా పొగిడారో తు.చ. తప్పకుండా చెప్పి వదిలిపెట్టారు.

ఇంకో వారంవున్నాక పురుషోత్తంగారు వూరికి వెడదామని ప్రయాణమవుతూ అన్నగారితో - మొగపిల్లలు ఇద్దర్నీ అక్కడ కాలేజీలో చేరిపిద్దాము అనుకుంటున్నాము కదా - శాంతనికూడా తీసుకవెళ్దామని వుంది - నువ్వేమంటావు అన్నారుట. నీ ఇష్టము వచ్చినట్లు చెయ్యి నన్ను అడిగేది ఏమిట్రా అన్నారుట వాళ్ళనాన్న. ఇంతలో వాళ్ళమ్మవచ్చి "పురుషోత్తం నీకు పుణ్యముంటుంది కాని దానికి ఏదేనా మంచి సంబంధం చూసి కుదుర్చు నాయనా, ఈ ఏడాది ముడిపెట్టేద్దాము. మీ అన్నయ్య ఇంటివిషయాలు బొత్తిగా పట్టించుకోరు. ఆయన చుట్టలు చుట్టుకుంటూ కూర్చుంటే దానికి పెళ్ళయినట్టే" - అంటూ ఏదో చదువుకుపోతోంది. వాళ్ళ నాన్నకి విసుగు వచ్చి "ఇంక ఆపుసోది, వినలేక చెవులు గళ్ళుపడుతున్నాయి. వెళ్లి నీపని చూచుకో. ఒరే అబ్బీ, శాంతకి చదువు చెప్పించటము నాకు ఎంతో ఇష్టంరా, నేనే అడుగుదాము అనుకున్నా. ఇప్పటికే ఇద్దరు నీ దగ్గరవున్నారు - దీన్ని కూడా పంపితే నీకు కష్టంగా వుంటుందేమోనని అడగలేకపోయాను. ఆపొలం మీద వచ్చిన గింజలు తిండికిపోను మిగిలినవి అమ్మిన డబ్బూ అక్కడా ఇక్కడా అప్పుచేసి పెద్దాడికి పంపేసరికి తలప్రాణం తోకకి వస్తోంది' ' అన్నారుట. దానికి ఆ లక్ష్మయ్య తల్లి అచ్చమ్మగారు స్నేహము. అవిడ ఏదో మోసుకువచ్చి సంబంధాలు చెపుతో వుంటుంది. అది ఎగురుతు వుంటుంది. వాళ్ళంటే సంచులు గుప్పగలరు. మనదగ్గర ఏముందే ఇచ్చేందుకు? మీ వదిన తెచ్చేవి ఎట్లాంటివంటే ప్లీడరుగుమాస్తా, కోమటి గుమాస్తా - వీళ్ళిద్దరూ కాకుండా ఇంకోడున్నాడు - వాడెవడంటే కోర్టు పక్షిగాడు లేడూ, వాడి కొడుకు - వాడొక శుంఠలే. ఈ ముగ్గురు బడుద్దాయిల్లో ఎవడికో వకడికి ఇచ్చి ముడిపెట్ట మని ఆవిడిగారి సలహా.

"చూశావా, ఎంతంత మాటలంటున్నారో నన్ను మీ అన్నయ్యా. నేనంటే ఎంత మంచభిప్రాయముందో విన్నావా"

"ఆఁ విన్నాను. ఏమన్నాడని అంత ఇదవుతావు? మనము కట్నాలు ఇచ్చుకోలేనప్పుడు నాలుగు అక్షరం ముక్కలు చెప్పిస్తే వాళ్ళపొట్ట వాళ్ళు పోసుకుంటారని వాడివూహ. అందులో తప్పేమిటో నాకు అర్థంకావటంలేదు."

"అవును నాయనా. 'నువ్వులూ, నూనెఒకటే, మధ్య తెలుకులాడే వేరు' అన్న సామెతగా మీ అన్నగారి తప్పులు నీకెందుకు కనిపిస్తాయిలే" అంటూ ఆవిడ మా బామ్మదగ్గరికి వచ్చికూర్చుంది.

ఒకరోజున శాంత మా ఇంటికి వచ్చింది. రాగానే 'ఆ వేషం ఏమిటే గంగిరెద్దులాగ' అంది నన్ను చూసి. పోనీలే అని అనగలిగాను. తరువాత ఆరోజే వాళ్ళ పినతండ్రిగారితో వూరికి వెడుతున్నానని చెప్పి వెళ్ళిపోయింది. అది వెళ్ళాక అద్దంలో చూసుకుంటే ఎంతో బాగున్నాను అనిపించింది. మా మామయ్య తెచ్చిన పరికిణీ, ఓణీ వేసుకుని అమ్మ నగలు అన్నీ పెట్టుకున్నా,

మా బామ్మ పువ్వులజడ వేసింది. ఇవి చూసి నన్ను గంగిరెద్దు అంటుందా? దానిలా దీపస్సెమ్మలా వుండాలి కాబోలు. ఇది అప్పుడు అనివుంటే బాగుండేది అనుకున్నా.

"అప్పా అప్పా" అంటూ శేషయ్య తాతయ్య (మా బామ్మ తమ్ముడులెండి) ఒగుర్చుకుంటూ వచ్చాడు, "ఎప్పుడు రావటం, అంతా కులాసాయేనా" గుక్కతిప్పకుండా ప్రశ్నలు వేసింది బామ్మ.

'అప్పా! అబ్బాయి లక్ష్మయ్య ఏడే' అని అడిగితే 'ఎక్కడి కెడతాడో నాతోఏమన్నా చెప్పివెడతాడా? కోడలు రాణీగార్ని అడుగు - ఆవిడకి తెలుస్తుంది. ఓరే శేషూ! ఒక్క గానొక్క కొడుకుకదా! ఆవిడగారికి అత్తయ్యా అని పిలిస్తే నామర్దా కాబోలురా నాయనా. నేను ఇల్లా హూనమవుతూంటే తనకి ఏమిపట్టనట్టు హాయిగా ఏదోపుస్తకం పెట్టుక్కూర్చుంటుంది. మొన్న పక్కింటావిడతో చెపుతోందికదా. మా ముసలమ్మ రోజు, రోజుకి మరీ కాల్చుకు తింటోంది అని. ఆ ముసలమ్మ ఎవరో తెలుసా? నేనుట. ఈఏడు కూతురి పెళ్ళి చేస్తే వచ్చేఏటికి తనూ అమ్మమ్మ అవుతుంది. ఇప్పటి వాళ్ళకు ముసలికంపు గిట్టదుగా - నన్ను తను ఎలాచెపుతుందొ రేపువాళ్ళు తనని అల్లా చెప్పాలి. బ్రతికి వుండాలేకాని కళ్ళతో చూడకపోతానా? అనేటట్లు చూస్తా. వినేవాళు వుండాలేకాని నాసోదికి అంతా? పంతా? ఆవిడగారు ఆ గదిలో వుంటుంది కేకవెయ్యి - ఏదో తొబుట్టిన వాడివికదా అని చెప్పుకున్నాను. మళ్ళా అనేవుకనక."

'అమ్మాయ్ అల్లుడు ఎక్కడికి వెళ్ళాడమ్మా' అంటూ తాతయ్యపిలిచాడు.

"ఎప్పుడు వచ్చావు బాబాయ్" అంటూ అమ్మ వచ్చింది.

ఏంలేదు. లక్ష్మినరసమ్మగారి అబ్బాయికి ఈ పక్క ఊరిలో ఏదో సంబంధము వుంటే చూడటానికి వచ్చాము. తీరా వచ్చాక గోత్రము ఒకటిఅయింది. పిల్లనచ్చలేదు. రైలుకి 2గం॥లు టైమువుంటే మన పూర్ణయ్యగారి సత్రంలో కూర్చోపెట్టి ఇల్లావచ్చా. మన చిన్నదాన్ని చూపిస్తే బాగుంటుందేమోనని తట్టింది. మీకుచెప్పి వెడదామని గబగబా వచ్చా. కుదిరితే పిల్లచాలా అదృష్టవంతురాలని చెప్పాలి. 150 ఎకరాలు సుక్షేత్రంవంటిభూమి, లక్షరూపాయలు రొక్కంవుంది. పైగా పిల్లాడు బి.ఎ. ప్యాసు అయ్యాడు. వాడికికబురు చేసి పిల్లదాన్ని ముస్తాబుచెయ్యి వాళ్ళని పిల్చుకువస్తాను నేను. అప్పా! కాఫీ ప్రయత్నము చెయ్యవే! అమ్మాయీ వెళ్తున్నానమ్మా.

'ఏం తాతయ్యా అప్పుడే వెడుతున్నావా' అన్నా. ఓసీ. ఎవరో అనుకున్నానే, అప్పుడే ముస్తాబు అయ్యావు అచ్చం భామ వేషంలా వున్నావు పిల్లవు. పెళ్ళి అవుతే తాతయ్యని మర్చిపోకేం' హుహూ అని నవ్వుతో వెళ్ళాడు.

వాళ్ళమాటలు అన్నీ విన్నా. వాళ్ళువస్తే నేను ఏమిచెయ్యాలి? ఏమిటోలావుంది. భయంలేదు. ఎల్లా చెప్పాలో తెలీటం లేదు.

నాన్న వచ్చాడు. వాళ్లు ఏమిటో మాట్లాడుకుని ఏదో ఖంగారు పడుతున్నారు. రామిగాడు సావడి తుడచి జంబుకానాలు, చాపలు పరిచాడు. అమ్మ ఇంట్లోవున్న వెండిసామనుకాక, పక్కఇంట్లో కొత్తగా కొనుక్కున్న వెండి గ్లాసులు అన్నీ తెచ్చి గదినిండా పెట్టింది. పక్కింటి వెంకమ్మ తనకి వాళ్ళ అత్తారుపెట్టిన నెక్లెసు తెచ్చి నామెళ్ళోపెట్టి 'ఇది అచ్చివచ్చిన వస్తువమ్మా, ఎవరు పెట్టుకు వెళ్లినా ఆపని అయితీరుతుంది' అంది.

అమ్మవచ్చి, "అదేమిటే ఇంకా అల్లాగే వున్నావు. కొంచము మొహము కడక్కుని వెంకమ్మచేత ఆ పరికిణీ, వోణి బాగున్నాయి, జాకెట్టుమాత్రము ఇప్పి మామయ్య తెచ్చిన పట్టు జాకెట్టు తొడుక్కో" అని వెళ్ళింది.

తాతయ్య ఓ పదిమందిని వెంటబెట్టుకు వచ్చాడు. అందులో ఆరుగురు ఆడవాళ్ళే.. అమ్మా, నాన్నా వాళ్ళని తీసుకువచ్చి కూర్చోబెట్టి మంచినీళ్ళు కావాలా అని అవీ ఇవీ

అడుగుతున్నారు. అందులో ఒక లావుపాటి ఆవిడ చేతులు తిప్పుకుంటూ అన్నీ పుచ్చుకునే వచ్చాము. పిల్లని త్వరగా చూపిస్తే, చూసి మళ్ళీ రైలుకి వేళ అయిపోకుండా వెళ్ళిపోవాలి అని తొందరచేసింది. తాతయ్య తొందరలేదు చాలా వేళ వుంది అని, అమ్మతోటి కాఫీ తీసుకురాఅమ్మా అనిచెప్పాడు.

అమ్మా, వెంకమ్మా, పక్కింటి సుందరమ్మగారుఅంతాకలిసి అన్ని పళ్ళాలు, కాఫీగ్లాసులు సావిట్లోకి జేరవేశారు. వాళ్లు 'ఇవన్నీ ఎందుకండీ!' అంటూనే అన్నీ ఖాళీ చెయ్యటం మొదలు పెట్టారు. ఇంకొంచం తీసుకోండి - అని మావాళ్ళు అనీఅనగానే ఆ లావుపాటి ఆవిడ బృందం మళ్ళీ వేయించుకుని పట్టించటము మొదలుపెట్టారు. అమ్మవాళ్ళు లోపలకు వెళ్ళగాచూసి ఆ లావుపాటి ఆవిడ పక్కావిడని ఎందుకుమళ్ళా వేయించుకోలేదని కళ్ళతో కసురుతూ చేతులతో సైగచేస్తోంది - నేనూ ఇవిఅన్నీ తలుపు సందులోంచి చూస్తున్నాలెండి. వీళ్ళకంటె మొగవాళ్ళని చూడాలని ఎందుకో ఎక్కువ ఇష్టంగావుంది. కాని, వాళ్ళు సరిగ్గా కనపడటంలేదు. కొంచము పక్కకి వున్నారు.

ఇంతలో వెంకమ్మ వచ్చిపమిట సవరించి కొంచము తలవంచుకు కూర్చోవే! అని చెప్పి నన్ను తీసుకువెళ్ళింది. నాకెందుకో కాళ్ళు కొంచము వణికాయి.

వచ్చినవాళ్లు  ఒక్కొక్కళ్ళే కిందనుంచి పైదాకా పరీక్ష చేశారు. వరసగా ప్రశ్నలు మొదలుపెట్టారు. కొన్నింటికి నేను, కొన్ని వెంకమ్మ చెప్పి పూర్తి చేసాము.

అందులో ఒకరు పాటేదేనా వస్తే పాడమన్నారు. అది వినేసరికి గుండెలు జారాయి... పాడుతుంది కాని దీనికిసిగ్గు ఎక్కువ, అని సర్దింది వెంకమ్మ. అందులో పళ్లుఎత్తు అమ్మాయి వుందిలెండి - ఆవిడ ఏదో పాటకురాలు అనుకోవాలని, అని కాబోలు పాడమని జిడ్డులాపట్టుకుంది. అసలు నాకు ఎక్కువ పాటులురావు. వచ్చినవి రెండు అయినా ఎవరి తోటైనా కలిసికాని పాడలేను . గోల - ఎల్లాగా అని బిక్కమొహంపెట్టి చూస్తున్నా. రామావందనం పాడానో లేదో వెంకమ్మ రక్షించింది. పాటలకేమిలెండి, పెళ్ళిఅయ్యాక ఎన్నేనా పాడించుకోవచ్చు, అని.

ఆ పళ్లు ఎత్తు ఆవిడ అంతలోనే నాపాటలోని విశేషం కనుక్కున్నట్టు కంఠం అంత బాగాలేదుగాని, అపస్వరము మాత్రము వున్నట్టులేదు. నేర్పిస్తే బాగా రాణించవచ్చు అంది.

సుందరమ్మగారు అందుకుని, "దానికేమి లోటమ్మా బారెడు జడ - లక్షణమైన పిల్ల' ' అంది.

ఆ లావుపాటి ఆవిడ లేచేప్రయత్నము చెయ్యసాగింది. ఒక్కకాలు ముందుకుజాపి, చేత్తో గడపపట్టుకుని, ముందుకి వంగి, వెనక్కివంగి, నాలిక మడతపెట్టి నానా అవస్తాపడి కొంతసేపటికి లేచి నిలుచోగలిగింది. అంతా వెళ్ళే ప్రయత్నంలో వున్నారు. అమ్మ వాళ్ళని ఇల్లుచూడమని లోపలికి తీసుకు వెళ్ళింది. బామ్మ వంటింట్లోంచి వాళ్ళందర్నీ పరీక్ష చేస్తోంది. అందులో ఒక నత్తిఆవిడ ఆపిల్ల మీకేమౌతుంది అని అడుగుతోంది. అది నా కొడుకు కూతురు అని వూరుకుంది. ఆవిడ నత్తితో అవస్తపడుతూ వాళ్ళంతా ఎవరికి ఎవరు ఏమి అవుతారో అన్నీ అవస్తపడి చెపుతోంది. మిగిలినవాళ్ళు నూతిదగ్గరకు వెళ్ళగాచూసి ఆవిడ... వాళ్ళు పిసినారివాళ్ళు మెతుకుపోతే బతుకు పోతుందనుకునేవాళ్ళు - వాళ్లకిఇస్తే పిల్ల ఏం సుఖపడుతుంది అని ఇంకా ఏవోచెప్పబోయింది - ఇంతలో వాళ్ళు రావటంచూసి వెళ్ళివస్తా పిన్నిగారూ అంటూ వాళ్ళదగ్గరకి వెళ్ళింది.

తాతయ్య ఆ బుంగమీసాలాయనతోటి ఏమిటో ఆ కొబ్బరిచెట్టు దగ్గరకి తీసుకెళ్ళి మాట్లాడుతున్నాడు. తాతయ్య ఓసారి నాన్న దగ్గరకి తీసుకెళ్ళి మాట్లాడుతున్నాడు. తాతయ్య

ఓసారి నాన్న దగ్గరకి, వోసారి ఆయన దగ్గరకి - ఇల్లా తిరుగుతున్నాడు.

తాతయ్య వాళ్ళతోకలిసి వెళ్ళాడు. కొంతసేపు అయ్యాక, తాతయ్య ఒక్కడూ తిరిగివచ్చాడు. అమ్మా, నాన్నా ఒక్కసారే, ఏమన్నా రేమిటి, ఆతృతగా - అడిగారు. మనము పెట్టిన బేరానికి మొగ్గారు. వియ్యపురాలు వోపట్టాన ఒప్పుకునే ఘటం కాదనుకో. ప్రతిసారీ ఇంతమందిని వేసుకొని చుడ్డానికి వెడితే బోలెడంత అవుతుంది. ఏదో పిల్లనచ్చింది కనక ఇదే ఒప్పుకుంటేసరి, శ్రమతగ్గుతుంది అని సమాధాన పడిందని చెప్పాడు. తాతయ్య ఇంకా, పిల్లదాని జాతకము ఇవ్వండి, జాతకాలు కుదిరితే పెళ్ళి పైబుధవారమే చెయ్యాలిట" అంటున్నాడు.

'అంత వ్యవధిలేకుండా చెయ్యటం నావల్ల కాదుబాబు' అన్నాడు నాన్న. మీరు కష్టపడేది ఏమిటి యిందులో - డబ్బు తీసుకు పట్నం వెళ్ళాము అంటే సాయంత్రానికి అన్నీ కొనితేవచ్చు. మీరు వెళ్ళి ముహూర్తము పెట్టించుకురండి దయచేసి అన్నీ నేన చూస్తాగా - మాతమ్ముడికి వైరు ఇవ్వండి - మా అమ్మను తీసుకు తక్షణం రమ్మని వాడువస్తే అన్నీ వాడేచూసుకుంటాడు" అంది అమ్మ.

అన్నీ కుదిరి పెళ్ళిముచ్చట్లు దిట్టంగా జరిగాయి. అయిన దానికీ, కానిదానికి పెళ్ళిలో నానా మాటలు అనటం - మా పిన్ని మా అత్తగారిని ఏదో అన్నదని భోజనాల దగ్గర్నించి వాళ్లు అంతా వెళ్ళిపోవటం మళ్ళీ వాళ్ళే బ్రతిమాలి తీసుకురావటం - ఇల్లా చిన్నచిన్న రభసలతోటి నా పెళ్లి బాగానే జరిగిపోయింది.

మధ్యన తాతయ్యని మావాళ్ళు, మా అత్తారూ కూడా ఏవో అన్నారుట. దాంతో తాతయ్యకి కోపంవచ్చి ఎవరికీ చెప్పకుండా పలాయనం చిత్తగించాడుట పాపం. పంచలచాపు కూడా ముట్టలేదుట యింత శ్రమపడితే....

నన్ను శ్రావణ తగూ ఇచ్చి తీసుకువెళ్ళారు. ఆ వెళ్ళటం మా అమ్మవచ్చి నన్ను పురిటికి తీసుకువస్తే మా వూరికి వచ్చాను. రోహిణికార్తె ఎండలు మండిపోతున్నాయి. బయట ఎంత వేడిగావున్నా మాఇంట్లో వుంటే చల్లగానే వుంటుంది నాకు, ఇంటిచుట్టూ చెట్లువుండబట్టో ఏమిటో. నేనువెళ్ళిన నాలుగు రోజులకి మామయ్య కుటుంబంతోసహా వచ్చాడు నన్ను చూడ్డానికి.

మామయ్య మా అత్తారిని ఒకటే హేళన చెయ్యటం మొదలు పెట్టాడు. మా అత్తగారిని అంటే నాకు సంతోషంగానే వుందికాని మా ఆయన్ని అంటేమాత్రం నాకు కష్టంతోచింది.

"వూరుకో మామయ్యా, మరీ అంత ఇదిగా తీసివెయ్యకు. నీలాగ డబ్బు తగలేస్తెగొప్ప లేకపోతే లేనట్టునా" అన్నా. నామాట పూర్తికాకుండానే అత్తయ్యకి కోపమువచ్చి "నేను చెపితే ఏమన్నా విన్నారు కనకనా, వాళ్ళకోసం ఇంతఖర్చు పెట్టి ఇన్ని తీసుకువచ్చారు. వాళ్ళు ఏమన్నా సంతోషించారు కనకనా, బొప్పికడితేకాని తెలీదులెండి - నేను ఎందుకు చెప్పటం" అని రుసరుసలాడింది.

నేను అల్లా అనలేదని చెప్పాలని ప్రయత్నిస్తున్నా. ఇంతలో మామయ్యే అందుకొని 'నీకు సమయం దొరకాలేకాని, మావాళ్ళ తప్పులు నిముషములో పట్టేస్తావు. ఈ తెలివి ఇంకోదాంట్లో వుంటే ఎంతపైకి వచ్చేదానివో' అని అత్తయ్యని ఏడిపించాడు.

అమ్మవచ్చి ఆ సంభాషణమార్చి "ఏమే మరదలా, సినిమాకి వెడదాముటే" అని అడిగింది. "ఆ నేను ఎందుకు లేండి. మీరు అంతా వెళ్ళండి" అంది. 'సరి, అసలు నీకోసమేగా వెళ్ళడం. రాకరాక వచ్చావయ్యే. మా పల్లెటూరి సినిమాహాలు ఎలావుందో చూద్దువుగానీ అనేసరికి ఆవిడ కొంచెమువుబ్బి. మీ తమ్ముడికంటే మీరేనయం - 'నువ్వు చూడాలి, నువ్వు

తినాలి. నువ్వు కట్టుకోవాలి' అని అపేక్ష పడతారు."

సినిమాకివెళ్ళే ప్రయత్నంలో పడ్డాము. పెందరాళే భోంచేసి వెడదామని అంతా హడావుడిలో పడ్డారు. మా వూళ్ళో హాలునిండితేకాని సినిమా మొదలుపెట్టరులెండి., అన్నీ పూర్తిచేసుకొని వెళ్ళాము. ఎప్పుడూరాని నాన్ననికూడా తీసుకువచ్చాడు మామయ్య. టిక్కెట్టుకూడా తనే కొన్నాడు. అమ్మ నాన్నని కోప్పడింది. 'మనింటికి వస్తే మనము కొనాలి కాని వాళ్లు కొనడము ఏమిటి - మీకు కొంచెముకూడా తెలీదు' అని.

'నీకు వుందిగా తెలివి, నువ్వు మీతమ్ముడికి ఇచ్చెయ్యి ఆ డబ్బు' అన్నారు గొప్పగా. అమ్మకి అల్లా అసలు ఇష్టంలేదు. లోపలే పళ్ళుకొరుక్కు వూరుకుంది, పైకి ఏమీ అనకుండా.

నేను "వూరుకోకుండా కుర్చీలు ఎందుకు బెంచీలు కొనకపోయావా మామయ్యా' ' అన్నా. "నీకెందుకే మీ అత్తారి డబ్బు కాదుగా; హాయిగా కూర్చో. యిదికూడా వాళ్ళ కోవలో చేరిందేవు. ప్రతిదీ అణాపైసలతో లెక్కలు వేస్తుంది" అని అమ్మతో అంటూ నవ్వుతున్నాడు.

అత్తయ్య మొహం సంతోషంగా కనిపించింది నాకు. అమ్మమ్మ, బామ్మ సినిమాలో నవ్వితే నవ్వటం, ఏడిస్తే ఏడవటం - దాంట్లో ఐక్యమై పోయారు.

యింకోరోజు మామయ్య 'ఊరికే గోళ్ళుగిళ్ళుకుంటూ కూర్చోపోతే నువ్వు, మీ అత్తయ్య ఆ తోటవేపు వెళ్ళిరా కూడదూ - తిన్నది అరుగుతుంది' అన్నాడు.

కొంచందూరం వెళ్ళేసరికి 'నేను నడవలేను బాబు యింటికి వెళ్ళిపోదాము' అన్నా. మళ్ళీ శాంతగారి ఇంటికి వెడదామన్న బుద్ధిపుట్టి అక్కడికి తీసుకువెళ్లా అత్తయ్యని.

శాంత తల్లి చాలా సంతోషించింది నన్ను చూసి. "మీ అమ్మ అదృష్టవంతురాలు - ఏడాది తిరగకుండా మనమల్ని ఎత్తుకుంటోంది" అంది.

ఇంతలో వాళ్ల మురళీవచ్చి, ఏడాదికి ఒకటి అయితే మామూలే. ఇద్దరు మనుమల్ని ఎత్తితే చాలా అదృష్టం" అన్నాడు. వీడికికూడా శాంతలా వాగుడు ఎక్కువ. నాకు చాలా కోపము వచ్చింది. ఏమీ చెప్పలేక వూరుకున్నా. ఇంక వెడదామని లేవబోయాను 'ఓపలేనిదానివి. వేడిగావుండి కాస్త మినపరొట్టె తినవే అని మా ఇద్దరికీ తెచ్చిపెట్టింది. 'శాంతకి చదువు చెప్పిస్తారుటమ్మా, పెళ్ళిచెయ్యరుట. మా ఇంట్లో నామాట గడ్డిపోచ విలువలేదనుకో. పోనీవీడి చదువు పూర్తి అయిందికదా అని వీడికిచేద్దాం అంటే, వుద్యోగము వస్తేకాని చేసుకోడుట. నా సోదికి అంతుఎక్కడలే. మీ అత్తారి సంగతులు చెబుదూ వింటాను. ఏమన్నా సాధిస్తుందా మీ అత్తగారు?'

"ఆవిడకి సాధించేందుకు తీరిక వుండదు. డబ్బుఇవ్వటం, పుచ్చుకోవటం - పొలంపని ఎల్లా అవుతుందో కనుక్కోటం - అందులో పడివుంటారు. సాధించటం వంతు మా పెద్దత్త గారిది. పని వుండదు. తీరుబడే వుండదు. వంట ఈవిడచేస్తే, మామగారి చెల్లెలు, మేనత్త వున్నారు. ఒకళ్లు వడ్డనచేస్తే వకళ్ళు విస్తళ్లు తీస్తారు. నాపని ఏమిటి అంటే ఏ గడపో పట్టుకొని నిలుచోటం - ఎదురుగుండా కనపడక పోయానంటే మా పెద్దత్తగారు అంటే ఆలావుపాటి ఆవిడ; అంత శరీరమువున్నా, ఏనుగులా చప్పుడు చెయ్యకుండా వచ్చి చూసి, అక్కడనించి రంకెలు మొదలుపెడుతంది.

ఓసారి నేను మంచము మీద కూర్చున్నాను. మావారు అద్దముదగ్గర తల దువ్వుకుంటున్నారు. నేను మామూలుగా "ఆ దువ్వెన ఇల్లా ఇవ్వండి" అన్నా.

ఈవిడ అక్కడికి ఎప్పుడు వచ్చిందో తెలీదు. అక్కడ నించి పట్టుకు నన్నూ, మావాళ్ళని దులిపి వదలిపెట్టింది. అది చాలక మా అత్తగారు రాగానే చెప్పి, ఆవిడచేత మిగిలిన బహుమతులు ఇప్పించింది.

నాకు ఏడుపువచ్చింది. ఆ పూట నాకు ఆకలిలేదని చెప్పివచ్చి పడుకున్నా. అంతమనిషి మళ్ళావచ్చి,నన్ను రెక్క పుచ్చుకు లాక్కువెళ్ళి విస్తరముందు కూర్చోపెట్టింది. మళ్ళీ లేవడానికి ధైర్యంలేక రెండుమెతుకులు తినివచ్చా. ఇల్లా తరచూ జరుగుతూనే వుంటాయి. అందులో విశేషము ఏమంటే వాళ్ళు ఎప్పుడూ తగు వేసుకుంటారు. నన్ను ఏమైనా అనేటప్పుడు మాత్రం అందరూ ఒకటయి వూరుకుంటారు. "అన్నట్టు అడగడం మర్చిపోయా ఆవిడ ఒక పిల్లని పెంచుతోంది. కొంచము నలుపుఅనుకో. కట్నం బాగానే ఇస్తారు. మీ మురళీకి చేసుకోరాదూ,' ' అన్నా.

అంతవరకూ చదువుతోన్నట్టు కనపడ్డ మురళీ, "ఏం? ఆవిడని నా మీదకి దాడి పంపుదామనా. ఏమిటి నీ ప్లాను లేక యేమన్నా కమిషను ఇస్తామన్నారా చెప్పు" అన్నాడు.

అత్తయ్య వెడదామని లేచింది. వస్తుంటే మంగమ్మ గారు కనిపించి కొంచంసేపు నిలుచోపెట్టింది. ఇంటికి రాగానే బామ్మ రెండు చీవాట్లుపెట్టింది. "పొద్దుకుకేదాకా పెత్తనాలు ఏమిటే - అందులో నిండుమనిషివి కూడాను" అని చదువుకుపోయింది.

మామయ్య ఆరోజు వెళ్ళిపోతానని పట్టుపట్టాడు. అమ్మ ఎల్లాగో ఇంకోవారం వుండమని బలవంతంగా ఆపింది. అన్నీ కలిసివచ్చాయి అనుకుంది అమ్మమ్మ. నాన్న నాకు పథ్యం పెట్టాక మా అత్తారికి వుత్తరం రాశాడు. - "పిల్లా పిల్లాడు కులాసగా వున్నారని," వాళ్ళు వెంటనే ఒక వీశ పాతబెల్లం మనిషికిచ్చి పంపారు. మా అత్తగారు అమ్మకి వుత్తరంకూడా పంపిందిట. అందులో పత్యము సరీగ్గాచేయించమని, బారసాల శుద్ధినాడే వాళ్ళకి నామకరణం ఆనవాయిట. మావాడు పుట్టిన వేళ మంచిదట - మా మరది ప్యాసయినట్లు తెలిసిందట."

ఆయన ప్యాసు అవడానికి విశేషం వుందిలెండి. ఎందుకు అంటారా - ఇదివరకు యస్. యస్. మల్. సి. ఎన్నిసార్లు పరీక్షకి వెళ్ళివచ్చే దాని అంత కనుక్కొని ఇంక లాభం లేదని ఆంధ్రా మెట్రిక్‌కి కట్టాడు.

మావాడికి మా అత్తగారి తండ్రిపేరు పెట్టారు. ఆయన అదృష్టము వాడికి వస్తుందిట - ఆ పేరు పెడితే నన్ను తీసుకువెళ్ళినా పిల్లాడిబాధ లేకుండా వాళ్ళే ఎత్తుకోవడం, నీళ్ల పొయ్యటం - అన్నీ వాళ్లే చూసుకునేవారు. ఆమురళి ఏవేళప్పుడు అన్నాడోకాని పిల్లాడికి 5 నెలలు నిండకుండానే మళ్ళీ సిద్ధం.

మా మరిదినికూడా వ్యవసాయంలో పెట్టారు. ఇది వరకు కొంత కవులుకి ఇచ్చారు. ఇప్పుడు అంతా వాళ్ళే చెయ్యటం మొదలుపెట్టారు. దాంతో ఇంకో నాలుగు జతల ఎద్దులు, ఇద్దరు పాలేళ్లు పెరిగారు.

నాకు ఇదికరకంత సర్దాగా వుండటంలేదు. అప్పుడప్పుడు విసుగ్గావుంటుంది. చంటివాడికి కొంచెం పొట్టవుబ్బితే మా పెద్దత్తగారు పొట్టంతా వాతలుపెట్టింది. వాడు ఒకటే గోల. వాళ్ళనాన్న 'ఎందుకు పెద్దమ్మా వాడిని అల్లా బాధపెట్టడం' అన్నారు.

ఆవిడ యుద్ధహంగామా మొదలుపెట్టింది. ఈసారి అత్తగారు ఆవిడతో చేరకపోయేసరికి, కళ్ళు గట్టిగా తుడుచుకుంటూ, ముక్కు చీదుతూ వూరుకుంది. చంటాడికి అప్పుడప్పుడు ఏదో సుస్తీ చేస్తూనేవుంది. అమ్మ నన్ను తీసుకువెళ్ళటానికి వచ్చింది. మా అమ్మనిచూసి చంటాడు ఒకటే గోల కొత్తకాబోలు.

మా ఆయన్ని 'మీరుకూడా రాకూడదా' అన్నా. 'చూస్తున్నావుగా ఎల్లా రావటం. పెద్దావు ఈనమోపుగా వుంది. చిన్నావు నిన్న ఈనింది. పొలంపన్లు బోలెడున్నాయి. మీ అమ్మకూడా వుందిగా! ఇంక నేను ఎందుకో? తోడు కావాలంటే అచ్చిగాడిని తీసుకెళ్ళు' అని పొలం వెళ్ళారు. నా కెందుకో మనసుకి చాలా కష్టంతోచింది. ఎంతో మనసు పడి అడిగా, ఏమి

లాభం. అర్థంచేసుకుంటేగా! పోనీ నేను వెళ్ళేదాకా ఐనా వుండకూడదూ. అప్పుడే వెళ్లిపోయారు.

మేము బయల్దేరాము. చంటాడు వాళ్ళ పెద్దబామ్మని వదలకుండా పట్టుకున్నాడు. తీసుకునే సరికి ఏడుపు లంకించుకున్నాడు. చంటాడికి ఏమన్నా కొనిపెట్టమని వాళ్ళ తాతయ్య చిల్లరడబ్బులు చేతిలో పెట్టారు. బండి వెడుతోంది. వాడి ఏడుపు మాత్రం అగలేదు. అమ్మ 'మీ తాతయ్య ఏమి ఇచ్చాడురా' అని వాడి జేబులోకి చూసింది. 'పాపం బీదవాడు మీ తాత' అని నవ్వటం మొదలెట్టింది. "వూరుకోవే, ఆయన దగ్గర ఏమి వుంటుంది పాపం, అంతా ఆవిడదగ్గరే. రోజూ అణో, బేడో చుట్టలకి యిస్తారు అంతే. అది కాస్తా వీడికిచ్చి నట్టున్నారు. ఇవ్వాళ అన్నా. "ఏం చేస్తారు బాబూ ఆ డబ్బు అంతా. తిండితినరు, గుడ్డకట్టుకోరు. ఏమి చేసుకుంటారో నాకుపెట్టిన చీర మాత్రము మళ్ళీ మీ అత్తారికే పెట్టాలికాని నేనుమాత్రం కట్టుకోలేను."

ఏడ్చి ఏడ్చి నిద్రపోయాడు. సాయంకాలానికి ఇంటికి చేరాము. అమ్మమ్మ ఎర్రనీళ్ళు, పచ్చనీళ్ళు తీసిపోసింది. కాస్సేపు నడుం వాలుద్దామనుకునేసరికి వీడు లేచి మళ్ళీ ఆరంభించాడు ఏడుపు.

వెంకమ్మ చూడ్డానికి వచ్చింది, "పెళ్ళికి చూడ్డమేనే, మళ్ళీ చూడలేదు" అంటూ. ఏమి మాట్లాడను వీడు, వూరుకుంటేగా. దానికి విసుగువచ్చినట్టు వుంది. "ఎప్పుడూ ఇంతేనా, కొత్తమూలాన్ని ఏడుస్తున్నాడా" అంది. అమ్మ చెప్పింది, "వాళ్ళ యింటిదగ్గర చిలకలా ఆడుకుంటాడే" మనల్ని చూస్తే ఏడుస్తున్నాడు అని. "అదీ కొంత నయమేలే, ఎప్పుడూ ఇంతేనేమో అనుకున్నా. మళ్లీవస్తాలే" అని వెళ్ళింది.

వాడి వీపుమీద ఒక్కటి చరిచా. దాంతో స్థాయి ఎక్కువ అయింది. నాకు బెంగ పట్టుకుంది. ఎల్లాగురా వాడితోటి అని. రోజులు గడుస్తున్నా వాడుమాత్రం ఎవ్వరిదగ్గరికీ పోడు. నేనే ఎత్తుకోవాలి. నాన్న ఉత్తరం చూసుకుని వాళ్లు పురిటిశుద్ధి నాటికి వచ్చారు. ఈసారి పిల్ల వాడికి "తిరుపతి వెంకన్న"కి మొక్కుకున్నారుట ఈ పేరు పెట్టారు.

పెద్దాడు బెంగపెట్టుకు, చిక్కాడుట. నన్ను వాళ్ళతో తీసుకుపోయారు. నాకు అప్పుడే వెళ్ళటం ఇష్టంలేకపోయినా పెద్దాడి యేడుపు భరించలేక బయలుదేరా. వెళ్ళగానే పెద్దాడిని వాళ్ళ పెద్దబామ్మ తీసుకుపోయి ముద్దులవర్షం కురిపిస్తోంది.

చంటాడిని పక్కవాళ్లు, పొరుగువాళ్ళు, ఇంట్లోవాళ్ళు అంతావచ్చి చూశారు. "వాళ్ళ అమ్మ పోలికేవాడు" అన్నారు. దాంతో మా అత్తగారి మొహం సంతోషంతో వుబ్బింది. ఇంక రోజూ మామరది మాట్టాడితే చిన్నాడు మన పోలికే - వాడు ఏడవడు - ఎవరు ఎత్తుకు తీసుకువెళ్ళినా వెళ్లిపోతాడు. నిదానంగా కోడలు ఎంత అందమైనదైనా మనమడిలోవున్న పెంకితనము - అల్లరిచెయ్యటం - ఇవి అన్నీ కోడలు తాలూకు వచ్చాయని అత్తారి అభిప్రాయం. పెద్దాడు నాపోలిక, చిన్నాడు వాళ్ళ పోలిక అని వాళ్ళవూహ.

కాలం మెల్లగా ఎడ్లబండిలా పోతూంది జరగవలసినవి అన్నీ సక్రమంగా జరుగుతున్నాయి. పగలంతా పొలంలోనే గడుపుతున్నారు తల్లీ కొడుకులు. మామగారు ఆ వేళకివచ్చి భోంచేసివెళ్ళి రావిచెట్టుకింద కూర్చుంటారు. నెలలు, సంవత్సరాలు వడుదుడుకులు లేకుండా గడిచిపోతున్నాయి. నేను నలుగురు బిడ్డల తల్లినయ్యాను, ఐదో దానికి రెండుమాసాలు ఓపిగపట్టాలి. మా పెద్దాడికి ఎనిమిదో ఏడు పూర్తి అవుతుంది. ఇంతవరకూ వాడి చదువుమాటే లేదు. మా మరిదిపెళ్ళి ముహూర్తం పెట్టారు. ఆ పిల్ల అత్తగారి చెల్లెలుమనుమరాలు. తల్లీ, తండ్రిపోతే పెత్తల్లి పెంచి పెద్దచేసింది. ఆ పిల్ల మరీ చిన్నదని ఇంతకాలం ఆగారు. లేకపోతే ఎప్పుడో చేశేవారు మా మరిదికి.

ఆ పిల్లనితీసుకువచ్చి మా అత్తారి ఇంటిదగ్గరే చేశారు పెళ్లి. చుట్టాలు అంతా ఎక్కడివాళ్లు అక్కడికి వెళ్ళారు. ఆ పిల్లని పెత్తల్లి తీసుకువెళ్ళింది. వాళ్ళువుండేది తూర్పున చాలా దూరంలో వున్నవూరులో. అందుకే ఇక్కడికి పెళ్ళి చేసారు. అమ్మకూడా వెడతానని ప్రయాణం అయింది. అత్తగారు వెళ్ళనివ్వలేదు. ఇంకో పదిరోజుల్లో నెలలు పూర్తి అవుతాయి. ఆ చెంబెడు నీళ్లుపోసీ వెడుదువుగాని అని బలవంతముమీద ఆపారు.

ఈసారి పురిటిలో కొంచం జ్వరంవచ్చింది. వారందాకా పథ్యం పెట్టలేదు. ఆ పిల్లకి ఆవూరి అమ్మవారిపేరు పెడతామని మొక్కుకున్నాక జ్వరం తగ్గింది అంటారు మాఅత్తగారు. ఆవూరి అమ్మవారిపేరు బాపనమ్మ. స్నానము అయినరోజునే పేరు రాయటం అలవాటు - ఆపేరే పెట్టారు. అమ్మకి, నాకు అంత ఇష్టంలేదు. అయినా వూరుకున్నాం. అమ్మ నన్ను తీసుకువెడదామని అనుకుంటే అత్తగారు ఇష్ట పడలేదు.

నాకు అమ్మ వెళ్ళడం అంత ఇష్టంగా లేదు. నీరసం నుంచో, ఏమిటో అస్తమానం ఏడుపు వస్తుంది, 'యివాళ వెడతానని' అమ్మ అనేసరికి నాకు తెలీకుండానే కళ్ళమ్మట నీళ్ళు బొటబొటా కారాయి. నన్ను చూసి అమ్మకికూడా కళ్ళు నీళ్ళువచ్చాయి. అయినా నన్ను కూకలేసింది. 'పచ్చికళ్ళతో కంటితడి పెట్టుకోకూడదు, నాకుమాత్రం ఎవరున్నారు. నిన్నువదలి వెళ్ళటానికి నాకుమాత్రం ఇష్టమా. ఇక్కడ ఎన్నాళ్ళు వుంటానుచెప్పు. అప్పుడే వచ్చి నెలపైన అయిందాయె. నాకు సిగ్గుగావుంది చెప్పొద్దూ. వెళ్ళాలి అన్నాకాళ్ళు ఆడటంలేదు. బొత్తిగా శల్యం అయిపోయావు. ఎప్పటికి తేరుకుంటావో ఏమిటో. ఈసారైనా దేముడి దయవల్ల కాన్పు ఎడంగావస్తే బాగుండను' అంది.

'ఇంకోవారం వుండవే అమ్మా' అన్నా. నామాట కాదని వెళ్ళలేక వుండిపోయింది.

దోడ్లో మా ఆయనమాటలు వినిపించాయి. 'పెద్దావు పూర్తిగా పాడయిపోయింది అమ్మా. దాన్ని జాగ్రత్తగా మేపాలి. నేను శ్రద్ధగా చూస్తే కాని అది తేరుకోదు' అంటున్నారు. ఆ మాటలు నాకు ముళ్లలా గుచ్చుకున్నాయి. అవును నాకంటేకూడా ఆయనకి ఆవులే ఎక్కువ అనిపించింది. నన్ను ఒక్కనాడన్నా ఈమధ్య అంత ఆదరంగా మాట్లాడారా అనిపించింది.

పెద్దాడు కడుపులోవుండగా ఎంతబాధ పడేవారు. డోక్కుంటే చూడలేక పోయేవారు. అన్నము తినటంలేదని విలవిల్లాడేవారు. ఎన్నో కథలు, కబుర్లు రాత్రి పొద్దుపొయ్యేదాకా చెప్పేవారు. రహస్యంగా స్నో సీసాలు, పౌడరు డబ్బాలు తెచ్చియిచ్చేవారు. పెద్దవాళ్ళు సాధించినా లక్ష్యం చేయకుండా నన్ను చూడాలని అటూ యిటూ తిరుగుతూ వుండేవారు. 'ఏ చీరకట్టుకున్నా ఎంత బాగున్నావు' అనేవారు.

ఇప్పుడు ఎంతమార్పు వచ్చింది. పెళ్లికి విధిలేక నాక్కూడా ఓ పట్టుచీర కొన్నారు. అది కట్టుకుని ఎల్లావుందంటే "నాకేం తెలుస్తుంది చీరల అందము" అన్నారు. పౌడరుడబ్బా కొనమంటే, "ఇంతమంది పిల్లలుపుట్టినా షోకులమీద మోజు పోలేదా" అన్నారు. అప్పుడు నాకు తప్పుగా తోచకపోయినా ఇప్పుడు తలుచుకుంటే దుఃఖము వచ్చింది. ఏడుస్తూ పడుకున్నా. ఆ రాత్రి బాగా జ్వరంవచ్చింది. అమ్మ కంగారుపడింది. "ఏమోయ్ పిల్లకి బాగా జ్వరము వచ్చింది. డాక్టరుని పిలుచుకుర"మ్మంది.

ఆయనకి చీమకుట్టినట్టుకూడా లేదు కాబోలు "ఈపూటకి కొంచెం కాఫీ ఇచ్చి పడుకోమనండి. రేపు చూసుకోవచ్చు" అన్నారు.

నాకెందుకో నామీదే అసహ్యం వేసింది. ఏదో ఆలోచిస్తూ పడుకున్నా, చిన్నప్పటిరోజులు తలచుకుంటే శాంత నన్ను వెక్కిరిస్తున్నట్టు అనిపించింది. ఎప్పుడు నిద్రపట్టిందో నాకు తెలీదు! అమ్మ పొద్దున్న లేపేటంతవరకు మెలుకువ రాలేదు. చంటిదానికి రాత్రి అమ్మే పాలుకలిపి

పోసిందిట. నా ఒళ్ళు ముట్టుకుచూసి "కొంచము తగ్గింది" అంది. ఇంతలో పెద్దత్తగారు మిరపకాయలు, వుప్పుతెచ్చి దిగతుడిచి తీసుకువెళ్ళారు. మళ్ళీవచ్చి "దిష్టి తగిలింది అమ్మా', ఎక్కడా గొడ్డు అన్నమాటే లేదు. నలుగురి తరువాత ఆడపిల్ల పుట్టడము అదృష్టమని ఒకటేగోల అందరూ; వూరివాళ్ళను తిట్టిపోస్తూ లోపలికి వెళ్ళింది ఆవిడ.

నేటివ్ డాక్టరు వచ్చిచూసి అల్లపరసంతో ఇవ్వమని రెండు మాత్రలు ఇచ్చి వెళ్ళాడు. అమ్మ కొంచెం కాఫీ తెచ్చి "ముందు ఇదిత్రాగు, తరువాత మందు వేసు కోవచ్చులే" అంది. మామయ్య మాఇల్లు వెతుక్కుంటూ వచ్చాడు. అమ్మలోపలికి పిల్చుకువచ్చింది. నన్నుచూడగానే మామయ్య కొయ్యబారిపోయాడు. 'ఇల్లాఅయిందేమిటీ పిల్ల; గుర్తుపట్టలేకుండా ఆ అందమంతా పోయి పిచ్చివాలకం వచ్చింది' అన్నాడు.

అమాటలువింటే పైకి గట్టిగా ఏడవాలి అనిపించింది. ఏడవలేక గుడ్లు అప్పజెప్పి మామయ్యని చూస్తున్నా.

మా అత్తగారువచ్చి మామయ్యని కుశలప్రశ్నలు అడిగేదాక నేను ఈ లోకములోకి రాలేదు. మామయ్య స్నేహితుడు డాక్టరు పరీక్ష ప్యాసయి మా వూరికి పదిమైళ్ల దూరంలో ఓ పల్లెలో హాస్పటలు పెట్టాడుట. దానికి స్నేహితులందర్నీ పిలిస్తే దానికోసమే తనూ వచ్చాడుట. అక్కడదాకా వచ్చి నన్ను చూడకుండా వెళ్ళడం ఏమిటని ఇల్లా వచ్చాడుట. అతనికే బామ్మ మొదట నన్ను యివ్వమంది. "ఛీ అట్లాంటికి జ్ఞాపకం చేసుకో కూడదు" అనుకుని లెంపలు వేసుకు దేముడికిదణ్ణం పెట్టుకున్నా.

మామయ్య స్నానం చేసివచ్చి నా మంచము దగ్గరగా కుర్చీలాక్కు కూర్చున్నాడు మామయ్య మా ఇంటి విషయాలు ప్రశ్నలు వేస్తున్నాడు. నేను అన్నింటికీ ముభావంగా 'వు' అని 'ఆ' అని, సమాధానం చెప్పుతున్నా. 'నిద్రవస్తే పడుకోవే' అన్నాడు.

"మామయ్యా ఆ డాక్టరు పెళ్ళి అయిందా" అన్నా. "నిన్నకూడా నీ విషయము అడిగాడు. ఆ బూరిబుగ్గల అమ్మాయి ఎక్కడుంది. చిన్నప్పుడు ఎంత బాగుండేది" అన్నాడు. "పెళ్ళి అయిందా" అనికాదు అడిగావు. సరి అసలు విషయం మర్చిపోయా. వారంక్రితమే అయింది. పెళ్ళి పార్టీ, హాస్పటలు పార్టీ కలిపి యిచ్చేశాడు. పెళ్లి అంటే రిజిస్ట్రారు ఆఫీసులో.

పెళ్ళికూతురు ఎవరో తెలుసా, నీ స్నేహితురాలు శాంత. చిన్నప్పుడు ఓ మాదిరిగా వుండేదా ఇప్పుడు ఎంత బాగుందనుకున్నావు. నేను పోల్చుకోలేక పోయాను. "నన్ను గుర్తుపట్టలేక పోయారు. మీకు బొత్తిగా జ్ఞాపకశక్తి లేనట్లు వుందే. మీకు ఏదైనా మందివ్వాలి - బుర్రకి సంబంధించింది." అని ఎంతోసేపు ఏడిపించింది. తను ఇప్పుడు ఆఖరి సంవత్సరం డాక్టరుపరీక్ష చదువుతోందిట. అది ప్యాసయి వచ్చి అతనితో కలిపి పని చేస్తుందిట.

వాళ్ళ అన్నలు ముగ్గురూ వుద్యోగాలలో వున్నారు. వాళ్ళ అమ్మానాన్న వాళ్ళదగ్గరే వుంటున్నారుట. "మధ్యలో కొన్ని కష్టాలుపడ్డా, ఇప్పుడు సుఖంగా వున్నాము" అని ఎంతో అమాయకంగా చెప్పేసింది. ఎంత మంచిపిల్లో. నువ్వు ఎల్లా వున్నావో అని అడిగింది. ఇప్పటికి ఎన్ని నెంబర్లని సృష్టించిందని నవ్వింది. మంచి హాస్యముంది పిల్లలో"

"చాలుమామయ్యా పొద్దోతోంది. ఇంకవినలేను" అనేశా.

మామయ్య తనకి జ్వరము, తలనొప్పి అనిచెప్పి "వెడుతున్నా టైము అయింది బస్సుకి, నువ్వు రెస్టు తీసుకో" అని పిల్ల చేతిలో పదిరూపాయలు పెట్టాడు.

నాకు శాంతమీద ఎందుకో విపరీతమైన కోపము వచ్చింది. అతను ఎంత మంచివాడోపాపం. శాంత చచ్చిపోతే బాగుండును అనిపించి, మళ్ళీ శాంతని చూడకుండా తనేపోతే; ఏమో; ఇంకేమీ ఆలోచించలేక నీరసంతో కళ్ళు మూసుకున్నాను. ✧